## క్లుప్తంగా

### కనకమహాలక్ష్మికి విశేష పూజలు



శ్రావణలక్ష్మి పూజలో పాల్గొన్న పలువురు ఉభయదాతలు

**డాబాగార్డెన్స్:** బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 25వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేద మంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0891-2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

**నేడు అష్టదళ పద్మారాధన..**

కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

### బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినతి



కలెక్టరేట్‌లో బీఎస్పీ నాయకులు

**మహారాణిపేట:** బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శివప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జిలు పెద్దాడ కనకమహాలక్ష్మి, ఎ.రామచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎ. ధనుంజయరావు, గాజువాక అధ్యక్షుడు నందికొల్ల అప్పారావు, ఇతర నాయకులు శంకరరావు, దేవరపల్లి శరత్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

### బాబు మోసాలపై ఇంటింటి ప్రచారం

33వ వార్డులో 'బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ'



బంగారుమెట్టలో ప్రచారం చేస్తున్న రమేష్ తదితరులు

**అల్లిపురం:** మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ ఆదేశాల మేరకు బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం 33వ వార్డులో వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. బంగారు మెట్టు కాలనీ బూత్ నంబర్ 64 పరిధిలో జరిగిన కార్యక్రమంలో గడప గడపకు వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజలను ఏ విధంగా మోసం చేసిందో వివరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు పచ్చిరపల్లి రాము, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్యనాయుడు, సలాది భాను, బుర్లి చిన్న, హేమ, కృష్ణారెడ్డి, బాడుగుల శ్రీనివాసరావు, పీపీఎస్ రెడ్డి, గురు స్వామి రెడ్డి, ధర్మ, చోడిపల్లి శివకుమార్, పాల దామోదర్ రెడ్డి, తరుణ్ కుమార్, ఎ.కొండలరావు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

**సింహాచలం :** శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నరశిపురం మాధవరావు లక్ష 116 రూపాయలు విరాళం అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ని ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందజేశారు. దేవస్థానం తరపున స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం ఆలయ అధికారులు అందజేశారు.

# క్షణక్షణం.. భయం భయం

- పాతనగరంలో కూలేందుకు సిద్ధంగా పలు కట్టడాలు
- బిక్కుబిక్కుమంటూ రోజులు వెళ్లదీస్తున్న ప్రజలు
- ఎడతెరిపి లేని వానలతో అంతా అస్తవ్యస్తం



కోటవీధి దర్గా వద్ద శిథిలమై పెంకులూడుతున్న పాత ఇల్లు



కోటవీధిలో భయం గొలిపేలా శిథిలమైన ఇల్లు



వన్‌టౌన్ గీతాభవన్ ప్రాంతంలో ఇలా..



వర్షం ధాటికి నానుతున్న మట్టి గోడలు..



పాతపోస్టాఫీస్ క్వీన్‌మేరీ పాఠశాల పురాతన భవనం.. భవనానికి ఆనుకునే ప్రమాదపుటంచున పలు దుకాణాలు



క్వీన్‌మేరీ పాఠశాల భవనంలో కూలేందుకు సిద్ధంగా ఉన్న చెట్లు





రాజప్పనాయుడు వీధిలో ఓ ఇంటి పరిస్థితి ఇలా..



థామ్సన్ స్ట్రీట్ వద్ద వర్షం ధాటికి పెచ్చులూడుతున్న శిథిలావస్థలో ఉన్న ఓ ఇల్లు



రాజప్పనాయుడు వీధిలో ఓ ఇంటి పరిస్థితి ఇలా..

**డాబాగార్డెన్స్:** పాతనగర వాసులు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోననే భయం గుప్పిట్లో నిద్రలేని రాత్రులు గడుపుతున్నారు. గత మూడు రోజులుగా కురుస్తున్న కుంభవృష్టికి పాతనగరంలో పలు పాత ఇళ్లు తడిచి ముద్దయ్యాయి. అవి ఎప్పుడు కూలిపోతాయోనని అందులో నివసిస్తున్న వారు భయంతో ఉన్నారు. పలువురు ఇంటి యజమానులు శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లను కూల్చకుండా ఉంచేయడంతో ఆ ఇళ్లల్లో అద్దెకు ఉంటున్న వారు ప్రమాదపుటంచుల్లో భయాందోళనలో ఉన్నారు. శిథిలావస్థకు చేరుకున్న ఇళ్లకు జీవీఎంసీ నోటీసులు జారీ చేసినా స్పందించడం లేదంటూ అధికారులే చెబుతున్నారు.

**ఎడతెరిపి లేని వర్షాలతో అస్తవ్యస్తం..**

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విరివిగా వర్షాలు కురుస్తున్నాయి. గత మూడు రోజులుగా కురుస్తున్న వానలకు దక్షిణ నియోజకవర్గం ప్రజలు బిక్కుబిక్కుమంటున్నారు. ఈ ప్రాంతంలో ఏళ్ల నాటి ఇళ్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిలోని కొన్ని ఇళ్లల్లో ఎవరూ లేకపోయినా కొంత మంది అభాగ్యులు ఆ ఇళ్లలో తలదాచుకుంటున్నారు. మరి కొన్ని ఇళ్లల్లో అద్దెకు ఉన్న వారు ఖాళీ చేయకపోవడం, ఇంటి యజమానులు కూడా పట్టీ పట్టనట్టు ఉండడంతో అంతా భయం గుప్పిట్లో బతుకుతున్నారు. సాక్షాత్తు జీవీఎంసీ యంత్రాంగం శిథిలావస్థకు చేరుకున్న ఇంటి యజమానులకు నోటీసులు జారీ చేసినా పలువురు స్పందించలేదు.

**పాతనగరంలోని పలు ప్రాంతాల్లో..**

పాతనగరంలో గత ప్రభుత్వాలు నిర్మించిన స్కీం ఇళ్లతో పాటు వాంబే గృహాలు కూడా పెచ్చులూడుతున్నాయి. ఏ పాటి వర్షం కురిసినా భయానక వాతావరణం ఏర్పడుతోంది. ముఖ్యంగా పాతనగరంలోని కోటవీధి, పాతపోస్టాఫీస్, అంబుసరంగు వీధి, చాగంటి వారి వీధి, థామ్సన్ స్ట్రీట్, రెల్లి వీధి, చిలకపేట, పద్మానగర్, తారకరామకాలనీ తదితర ప్రాంతాల్లో పలు గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

## బాబు మోసాలపై ప్రజలను చైతన్యపరచాలి

నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి



సమన్వయ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న వాసుపల్లి గణేష్‌కుమార్

**డాబాగార్డెన్స్:** నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశం సోమవారం ఆశీల్‌మెట్టలోని మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి కార్యాలయంలో నిర్వహించారు. కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, పార్టీ అనుబంధ సంఘాల నేతలతో వాసుపల్లి సమావేశమయ్యారు. బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమంపై పలు సూచనలు చేశారు. క్షేత్రస్థాయికి ఈ కార్యక్రమం తీసుకెళ్లాలని, ప్రతి గడపకు వెళ్లి ప్రజలను చైతన్య పరచాలన్నారు. కూటమి ప్రభుత్వం చేస్తున్న ఫెయిల్యూర్ పాలన, బాబు చేస్తున్న మోసాలు ఎండగట్టాలన్నారు. రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా, పేద ప్రజలు సంతోషంగా ఉండాలన్నా మళ్లీ జగనన్న ప్రభుత్వం రావాలన్నారు. అందుకు వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరూ కష్టపడాలని సూచించారు. పార్టీ కోసం అహర్నిశలు కష్టపడే వారికి అధిష్టానం మంచి గుర్తింపునిస్తుందని తెలిపారు. వార్డు, బూత్ స్థాయిలో కమిటీ వేసి ఈ నెల 31లోగా నియోజకవర్గ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. వాటిని అధిష్టానానికి పంపిస్తామన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజలను మభ్యపెడుతూ రాష్ట్రాన్ని అంధకారంలోకి నెడుతున్న చంద్రబాబు, నారా లోకేష్, పవన్ కల్యాణ్ విధి విధానాలు తిప్పి కొట్టాలన్నారు. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు నియోజకవర్గ ప్రజలకు అండగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## తక్షణం సమస్యలు పరిష్కరించాలి



వినతులు స్వీకరిస్తున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

**జగదాంబ:** ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ప్రజలు వినియోగించుకోవాలని జీవీఎంసీ జోన్-4 జోనల్ కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం జోన్-4 కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పబ్లిక్ హెల్త్‌కు 1, రెవెన్యూ విభాగానికి 3, టౌన్ ప్లానింగ్ విభాగానికి 2 వినతులు వచ్చాయి. ఈ సందర్భంగా జెడ్సీ మాట్లాడుతూ గ్రీవెన్స్ సెల్ ద్వారా వచ్చిన సమస్యలు వెంటనే పరిష్కరించాలన్నారు. అర్జీదారులకు ఫోన్ చేసి సమస్య పరిష్కారం అయ్యిందా లేదా అని అడిగి తెలుసుకోవాలన్నారు. పరిష్కారం అయిన సమస్యలను రికార్డులో రాసి ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంహెచ్‌వో కృష్ణంరాజు, ఇంజినీరింగ్ అధికారి నర్సింహారావు, యూజీడీ, ఎలక్ట్రికల్ ఏఈలు, తాగునీటి విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలి



పాత కట్టడంలో నివసిస్తున్న వారికి జాగ్రత్తలు చెబుతున్న జెడ్సీ మల్లయ్యనాయుడు

**జగదాంబ:** వర్షాల నేపథ్యంలో అంటు వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జీవీఎంసీ జోన్-4 జెడ్సీ ఎం.మల్లయ్యనాయుడు అన్నారు. సోమవారం ఆయన జోన్ పరిధిలో 12 వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా లోతట్టు ప్రాంతాల్లో మురుగు నీరు అధికంగా ప్రవహిస్తున్న వీధులను పరిశీలించారు. కాలువల్లో చెత్తను పారిశుధ్య కార్మికులతో తీయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా వీధుల్లో మురుగు నీరు, బురద చేరి దుర్వాసన వెదజల్లుతున్నాయన్నారు. బ్లీచింగ్, ఫినాయిల్ జల్లాలన్నారు. ఎక్కడా చెత్త కుప్పలు లేకుండా శుభ్రం చేయాలన్నారు. తుపాను నియంత్రణ గది ఏర్పాటు చేశామన్నారు. అలాగే 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకున్నామని తెలిపారు. సెక్రటరీలు ప్రజలకు అవగాహన కల్పించి పాతభవనాల్లో నుంచి బయటికి తీసుకొచ్చి జీవీఎంసీ ఏర్పాటు చేసిన కంట్రోల్ రూములకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌స్పెక్టర్లు, సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

## అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

**సింహాచలం :** శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్య ధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

## ముడసర్లోవ రిజర్వాయర్‌కు కొత్త నీరు



కొత్త నీటితో ముడసర్లోవ రిజర్వాయర్


**ఆరిలోవ :** మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ముడసర్లోవ రిజర్వాయర్‌లో కొత్త నీరు చేరింది. దీని నీటి మట్టం కొంత మేరకు పెరిగింది. దీంతో ఆరిలోవ వాసులకు నీటి సమస్య ప్రస్తుతం తీరినట్లయింది. కొంత కాలంగా వర్షాలు లేకపోవడంతో పాటు ఇటీవల తీవ్రమైన ఎండలకు ఈ రిజర్వాయర్‌లో నీరు అడుగంటిపోయింది. దీంతో నీటి సరఫరా విభాగం అధికారులు ఆరిలోవ ప్రాంతానికి సక్రమంగా నీటి సరఫరా చేయలేని పరిస్థితి నెలకొంది. మరోవైపు భూగర్భ జలాలు ఇంకిపోయి నీటి కోసం ఆరిలోవ ప్రాంతంలో ప్రజలు తీవ్ర ఇబ్బంది పడ్డారు. రిజర్వాయర్ సామర్థ్యం 170 అడుగులు కాగా ఇటీవల ఎండలకు 158.2 అడుగులకు నీరు ఇంకిపోయింది. ప్రస్తుతం భారీగా కురిసిన వర్షాలకు వరద నీరు చేరడంతో సోమవారం సాయంత్రానికి నీటి మట్టం 159.8 అడుగులకు చేరింది.

## వీరికి లేదా సెలవు..!

- యథావిధిగా తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు

**మద్దిపాలెం:** బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా ఆదివారం ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల ప్రభావంతో ఇప్పటికే అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో అప్రమత్తమైన అధికారులు సోమవారం పాఠశాలలు, కళాశాలలకు సెలవు ప్రకటించారు. అయితే అర్బన్ ఐసీడీఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు మాత్రం సెలవు ప్రకటించకపోవడంతో యథావిధిగా అవి తెరుచుకున్నాయి. తల్లిదండ్రులు తమ పిల్లలను అంగన్‌వాడీ సెంటర్లకు పంపించారు. ఇదిలా ఉండగా అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించిన అధికారులు అంగన్‌వాడీ ప్రీ స్కూళ్లకు ఎందుకు సెలవు ప్రకటించలేదని, వీరికి సెలవు వర్తించదా అని ప్రశ్నిస్తున్నారు. పిల్లలకు ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## హైకోర్టు న్యాయమూర్తి తుహిన్‌కుమార్‌కు సత్కారం



హైకోర్టు న్యాయమూర్తి తుహిన్‌కుమార్‌ను సన్మానిస్తున్న ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ప్రతినిధులు

**విశాఖ సిటీ:** రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులై విశాఖ పర్యటనకు వచ్చిన గేదెల తుహిన్‌కుమార్‌ను ప్రభుత్వ అతిథి గృహంలో సోమవారం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన ప్రతినిధులు కలిశారు. ఈ సందర్భంగా శాలువా కప్పి సన్మానించారు. అనంతరం ఉత్తరాంధ్ర విద్యార్థి సేన వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ సుంకరి రమణమూర్తి మాట్లాడుతూ వెనుకబడిన ప్రాంతం నుంచి హైకోర్టు న్యాయమూర్తిగా గేదెల తుహిన్‌కుమార్‌ను నియమించడం గర్వించదగ్గ విషయమన్నారు. దళిత నాయకుడు రావాడ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## ర్యాగింగ్‌తో జీవితం నాశనం

**అగనంపూడి:** ర్యాగింగ్ వల్ల జీవితాలు తలకిందులవుతాయని, విద్యార్థులు ర్యాగింగ్ జోలికి పోవద్దని దువ్వాడ ట్రాఫిక్ సీఐ కిల్లి వెంకటరావు అన్నారు. విజ్ఞాన్ ఇంజినీరింగ్ కళాశాలలో సోమవారం యాంటీ ర్యాగింగ్, రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన వారోత్సవాల ముగింపు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ లేకుండా చేయాలని భావిస్తే ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా తీర్చిదిద్దడం సులభమన్నారు. ప్రతీ ఒక్కరూ ర్యాగింగ్‌కు దూరంగా ఉంటానని ప్రతిజ్ఞ చేసుకోవాలన్నారు. హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ జె.సుధాకర్, రెక్టార్ వి.మధుసూదనరావు మాట్లాడుతూ యూజీసీ నిబంధనల మేరకు ర్యాగింగ్‌కు పాల్పడేవారిని ఉపేక్షించేది లేదన్నారు. కార్యక్రమంలో డీన్ (పరిపాలన) హరిగోవిందరావు, యాంటీ ర్యాగింగ్ సెల్ ఇన్‌చార్జి మదన్‌శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## గణపతి నవరాత్రులకు శ్రీకారం



రాట మహోత్సవంలో పాల్గొన్న శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ సభ్యులు

**అల్లిపురం:** అల్లిపురంలోని శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత 19 సంవత్సరాలుగా గణపతి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా 20వ గణపతి నవరాత్రి ఉత్సవాలకు సోమవారం శ్రీకారం చుట్టారు. దీంట్లో భాగంగా పందిరి రాట మహోత్సవం అత్యంత వైభవంగా చేపట్టారు. కమిటీ సభ్యులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని రాటకు పూజలు చేసి ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు భీశెట్టి గోపీకృష్ణ మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా వినూత్న రూపాలలో వినాయకుడిని పర్యావరణ హితంగా పూజిస్తున్నామని తెలిపారు. నాలుగు సంవత్సరాలుగా రెడ్ ఎఫ్ఎం వారి ప్రత్యేక లడ్డూ గెలుచుకుంటున్నామన్నారు. ఈ ఏడాది కూడా గణపతి ప్రత్యేక రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, అధిక సంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

## చినుకు పడితే చిత్తడే



రోగిని వార్డు నుంచి పరీక్షలకు తీసుకెళ్తున్న బంధువులు



వీల్‌చైర్‌లో పరీక్షల కోసం రోగి తరలింపు దృశ్యం

వర్షంతో కేజీహెచ్ రోగులకు ఇక్కట్లు

**మహారాణిపేట:** వర్షం పడితే కేజీహెచ్ రోగులకు ఇబ్బందులు తప్పవు. సోమవారం కురిసిన వర్షంతో వివిధ పరీక్షల కోసం వార్డు నుంచి రోగులను పరీక్షల కేంద్రానికి తరలించడానికి వారి బంధువులు ఇక్కట్లకు గురిఅయ్యారు. వీల్ చైర్, స్ట్రెచర్ ఉన్నా సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రోగి వాటిని నడిపించుకుని, తోసుకుని వెళ్లారు. వర్షం కురిసే సమయంలో తలదాచుకోవడానికి షెల్టర్లు కూడా లేవు. ఆస్పత్రికి చికిత్స కోసం వచ్చే రోగులు వర్షంలో తడుస్తూ ఉన్నారు. అలాగే చికిత్స కోసం వచ్చేవారు, వారి సహాయకులు కూడా తడుస్తూ చికిత్స చేయించుకున్నారు. కొంత మంది ముందస్తుగా గొడుగులు తెచ్చుకుని తాత్కాలిక ఉపశమనం పొందారు. చిన్న పిల్లల తల్లులు, వృద్ధులు కూడా ఇబ్బందులకు గురయ్యారు.

## ఎర్రిగెడ్డ పూడికతీత పనులు పరిశీలించిన మేయర్



ఎర్రిగెడ్డ పూడికతీత పనులు పరిశీలిస్తున్న మేయర్ శ్రీనివాసరావు

**డాబాగార్డెన్స్:** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల వల్ల గెడ్డలు, కాలువలు పొంగి పొర్లకుండా అడ్డంకులు ఉన్న చోట పూడికతీత పనులు నిరంతరం చేపట్టాలని మేయర్ పీలా శ్రీనివాసరావు జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. జోన్-5 పరిధి జ్ఞానాపురం ఎర్రిగెడ్డ పూడికతీత పనులు జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్‌కుమార్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో కాలువలు, గెడ్డలు పొంగి పొర్లకుండా, నిరంతరం పూడికతీత పనులు చేపట్టి, వర్షపు నీరు సజావుగా పారేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎర్రిగెడ్డ వరదల వల్ల సమీప కాలనీలు మునిగే ప్రమాదం ఉన్నందున గెడ్డలోని పూడికతీత పనులు జేసీబీ సాయంతో వేగవంతం చేయాలన్నారు. అధికారులు ముంపు ప్రాంతాలను గుర్తించి నిరంతరం ఆయా ప్రాంతాల్లో కాలువలు, గెడ్డలు పొంగకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భూగర్భ డ్రైనేజీ నాళాలు లీకులు లేకుండా వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు.

## డేటా విశ్లేషణలో క్వాంటమ్ టెక్నాలజీ కీలకం





ప్రసంగిస్తున్న కృష్ణా విశ్వవిద్యాలయం వీసీ రాంజీ

**మురళీనగర్:** అభివృద్ధి చెందుతున్న సాంకేతిక ప్రపంచంలో డేటా విశ్లేషణకు సంబంధించి క్వాంటమ్ టెక్నాలజీ కీలకం కానుందని కృష్ణా విశ్వవిద్యాలయం ఉప కులపతి డాక్టర్ కె.రాంజీ అన్నారు. ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఏఐసీటీఈ ఆధ్వర్యంలో పాలిటెక్నిక్ అధ్యాపకులకు 'న్యూమరికల్ అప్రోచ్ ఇన్ డిజైన్ థింకింగ్' అనే అంశంపై కంచరపాలెం పాలిటెక్నిక్ కళాశాలలో ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రత్నకుమార్ పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఆరు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించి ప్రసంగించారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను బోధనాభ్యాసనలో వినియోగించాలని సూచించారు. ఫైనైట్ ఎలిమెంట్, ఫైనైట్ డిఫరెన్స్, ఫైనైట్ వాల్యూమ్ పద్ధతులను భవిష్యత్తులో ఏఐ వంటి టెక్నాలజీలో వినియోగిస్తారన్నారు. గౌరవ అతిథి, రాష్ట్ర సాంకేతిక విద్యా శాఖ ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ ఎం.ఏ.వి.రామకృష్ణ మాట్లాడుతూ డిప్లొమా స్థాయిలోనే హ్యూమన్ ఫ్రెండ్లీ డిజిటల్ టెక్నాలజీని పాఠ్యాంశంగా చేర్చాల్సి ఉందన్నారు. దీని వల్ల విద్యార్థులు భవిష్యత్తులో ఏఐ, క్లౌడ్ కంప్యూటింగ్, రోబోటిక్స్ వంటి రంగాల్లో మెరుగైన అవకాశాలను పొందుతారన్నారు. ప్రత్యేక అతిథి శ్రీకాకుళం పాలిటెక్నిక్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నారాయణరావు మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థుల కెరీర్‌కు డిజైన్ థింకింగ్ ఉపయోగపడుతుందని చెప్పారు. ఎస్ఏస్టీఎల్ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.ఎస్.గణేష్‌కుమార్ డిజైన్ థింకింగ్ ప్రాముఖ్యతను వివరించారు. శిక్షణకు వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాలిటెక్నిక్ కాలేజీల ఫ్యాకల్టీలు, ఇంజినీరింగ్ కళాశాలల అధ్యాపకులు, పరిశోధకులు హాజరయ్యారు.